క్లుప్తంగా

ఎంపీ భరత్‌రామ్‌కు కృతజ్ఞతలు



ఎంపీ భరత్‌రామ్‌కు మొక్క అందజేస్తున్న లక్ష్మణరావు

రాజమహేంద్రవరం రూరల్: అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు డైరెక్టర్‌గా నియమితులైన కడియాల లక్ష్మణరావు సోమవారం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలు, వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆర్యాపురం కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ మార్గాని సురేష్, గుర్రం గౌతమ్, రామ్ శర్మ తదితరులు కడియాల లక్ష్మణరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడియం: జాతీయ రహదారిపై బుర్రిలంక వద్ద ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని కడియం పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 నుంచి 40 ఏళ్ల ఉంటుందన్నారు. అతడి కుడిచేతిపై ఏసుప్రభువు సిలువ పచ్చబొట్టు ఉందన్నారు. ప్రమాదంలో అతడి తల నుజ్జునుజ్జయిపోయిందన్నారు. కాగా.. అతడు మూడు రోజులుగా ఆంజనేయ స్వామి గుడి సమీపంలో తిరిగేవాడని, హిందీలో మాట్లాడాడని స్థానికులు చెబుతున్నారన్నారు. ఆచూకీ తెలిసినవారు కడియం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గృహసారథుల నియామకం



నూతనంగా నియమితులైన గృహసారథులు

రాజమహేంద్రవరం సిటీ: నూతనంగా నియమితులైన గృహసారథులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలని 31వ డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం పిలుపు నిచ్చారు. 31వ డివిజన్ 57వ సచివాలయానికి సోమవారం జగనన్న గృహసారథులను నియమించారు. ఈ సందర్భంగా సచివాలయం కన్వీనర్లను, గృహసారథులను మజ్జి నూకరత్నం, మజ్జి అప్పారావు, లంక సత్యనారాయణ, హబీబుల్లాఖాన్, నల్ల రామాంజనేయులు సత్కరించారు.

635 మందికి వైద్యసేవలు

సీతానగరం: రఘుదేవపురం సచివాలయంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 635 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఇందుగుమిల్లి చంద్రలీల, ఎంపీటీసీ యలమాటి లలితా శిరీష ప్రారంభించారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, లక్ష్మి, ఎంఎల్ హెచ్‌వీ విజయ, ఏఎన్ఎం రమణ, ఆశ వర్కర్లు కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

కలవచర్లకు ఎల్ఐసీ నజరానా

రాజానగరం: జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) గోకవరం బ్రాంచ్ ద్వారా జరిగిన వ్యాపార, లావాదేవీలను అనుసరించి మండలంలోని కలవచర్లను 4వ పర్యాయం బీమా గ్రామంగా ప్రకటించి, రూ.లక్ష నజరానాగా అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి ఉపయోగించాల్సి ఉంటుంది. ఇందులో కీలకపాత్ర వహించిన ఏజెంట్ తర్రా వీరబాబును గోకవరం ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ విద్యాసాగర్, శాటిలైట్ సిటీ బ్రాంచ్ ఇన్‌చార్జి ఎంవీవీఎస్ రెడ్డి, ఏఓ ఎలిపే శ్రీనివాస్, డీఓ పప్పు దుర్గయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా రాజబాబు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	:	అమిగోస్
సూర్యమినీ సుడు	:	వసంతకోకిల,వారసుడు
సూర్యప్యాలెస్	:	అమిగోస్
స్వామి	:	వాల్తేరువీరయ్య
శివజ్యోతి	:	నువ్వొస్తానంటే.. నేనొద్దంటానా..
అనుశ్రీ	:	టైటానిక్
రాజా	:	మైఖేల్
ఊర్వశి	:	పఠాన్
రంభ	:	వారసుడు
మేనక	:	వేద
అశోక	:	వీరసింహారెడ్డి
గీతాఅప్సర	:	రైటర్ పద్మభూషణ్
నామవరం		
వీఎస్ మహల్	:	అమిగోస్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	అమిగోస్
కడియం		
వెంకటసూర్య	:	అమిగోస్

అర్హులందరికీ ఇళ్లు కట్టించి ఇస్తాం

- సీఎం జగన్ లక్ష్యం కూడా అదే
- ఎంపీ భరత్‌రామ్



మహిళల వినతులు పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తనదేనని, ఈ విషయంలో ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పని లేదని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ హామీ ఇచ్చారు. సోమవారం పలువురు మహిళలు వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి వచ్చి ఆయనను కలిశారు. తమ సమస్యలను ఎంపీ ఎదుట ఏకరువు పెట్టారు. 20 ఏళ్లుగా తమ సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని, గూడు లేదని చెప్పినా స్పందించిన నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో ఉన్నామన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ నగరంలో 45 వేల పట్టాలు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 15 వేల మందికి ఇచ్చామని, వీటిలో 6,500 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు ఎక్కడికక్కడ కోర్టులలో కేసులు వేసి అడ్డుకోవడానికి యత్నించడం వల్ల జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం న్యాయ స్థానాలలో అడ్డు తొలగిందని, త్వరలోనే లబ్ధిదారులకు పట్టాలిస్తామని చెప్పారు. ఎవరెన్ని అవరోధాలు సృష్టించినా మీకు పట్టాలిచ్చి, ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. త్వరలోనే మీకు స్థలాలు కేటాయించిన వెలుగుబందలో లబ్ధిదారుల సమావేశం నిర్వహించి వివరిస్తానని మాట ఇచ్చారు. మీకు పట్టా మంజూరైందని సూచిస్తూ హామీ పత్రాలిచ్చారు కదా, వాటిని జాగ్రత్తగా ఉంచండి, ఇవి ఉన్న ప్రతీ ఒక్కరికీ తప్పకుండా ఇళ్ల పట్టాలిచ్చే బాధ్యత పూర్తిగా తనదేనని ఎంపీ భరత్ తెలిపారు.

బాలోత్సవాన్ని విజయవంతం చేద్దాం



ఆహ్వానాలు అందజేస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు

కడియం: రాజమహేంద్రవరంలో ఈనెల 25, 26 తేదీల్లో జరిగే గోదావరి బాలోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని నిర్వాహక కమిటీ ప్రతినిధులు చిలుకూరి శ్రీనివాసరావు, గొల్లపల్లి సత్యనారాయణ, సాకా అనిత పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు బాలోత్సవం కార్యక్రమానికి ఆహ్వానాలు అందజేశారు. వారు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు, విజ్ఞానం పెంచే కార్యక్రమాలతోపాటు ఆహ్లాదపరిచే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు జరుగుతాయన్నారు. మనోవికాసానికి, మైత్రీ బంధాలకు తోడ్పడే ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలన్నారు. ఎస్‌కేవీటీ హైస్కూల్లో జరిగే ఈ కార్యక్రమంలో విజేతలైన బాలలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారన్నారు. పిల్లలకు భోజన ఏర్పాట్లు కూడా బాలోత్సవ కమిటీ సిద్ధం చేసిందన్నారు.

ఎంఎస్ చక్రవర్తి విగ్రహాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీచక్రవర్తి

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థ తొలి మేయర్‌గా రాజమహేంద్రవరం అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన మాటూరి శ్రీనివాస చక్రవర్తి విగ్రహాలను కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణం, క్వారీ సెంటర్‌లలో ఏర్పాటు చేయాలని ఆయన సతీమణి మాటూరి లక్ష్మీచక్రవర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2003 గోదావరి పుష్కరాలను నభూతో నభవిష్యత్ అన్న విధంగా నిర్వహించడమే కాకుండా పుష్కరాలను వినియోగించుకుని నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంలో చక్రవర్తి ఎనలేని సేవలదించారన్నారు. పుష్కర ఘాట్, గౌతమ ఘాట్ వంటి ప్రాంతాల్లో అనేక దేవాలయాలు రావడానికి విశేషంగా కృషి చేశారన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం నాయకుడు ముత్యాల పోసికుమార్ అన్నారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహక బహుమతి రూ.1.50 లక్షలు చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సోమవారం ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద దివ్యాంగులు, వృద్ధులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), శ్రీరంగం బాలరాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ముత్యాల సత్య, బి.దుర్గ పాల్గొన్నారు.

15న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న 21 వాహనాలకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్టు ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. వివరాలకు 91777 44055 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పథంలో జేగురుపాడు



స్టాలిన్, సర్పంచ్

కడియం: జేగురుపాడు గ్రామంలో ఈ రెండేళ్లలో విస్తృతమైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఆ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జనరల్ స్థానం నుంచి పోటీ చేసినప్పటికీ గ్రామ ప్రజలు తనపై ఉన్న నమ్మకంగా అనూహ్య విజయం చేకూర్చారన్నారు. గెలిచిన నాటి నుంచీ రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మండలంలోనే మొట్టమొదటగా గ్రామ సచివాలయాన్ని నిర్మించి అందుబాటులో తీసుకువచ్చామన్నారు. ఆర్బీకే నిర్మాణం జరుగుతోందన్నారు. శ్మశానం చుట్టూ ప్రహరీ, చిల్డ్రన్స్‌పార్క్, ఓపెన్ ఎయిర్ జిమ్, సీసీ రోడ్లు, డ్రైన్లు, స్కిల్ డెవలప్‌మెంట్‌సెంటర్ భవన నిర్మాణం, సీనియర్ సిటిజన్స్ రెస్ట్ హౌస్, స్కూల్స్‌లో టాయ్‌లెట్ల నిర్మాణం, వైఎస్సార్, పూలే విగ్రహాల పార్కు నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంకా పలు కార్యక్రమాలు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు.

రాజేష్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



రాజేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొందేశి శ్రీనివాసులు రెడ్డి

ధవళేశ్వరం: ఇటీవల హత్యకు గురైన అండిబోయిన రాజేష్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి సోమవారం రూ. 50 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన ప్రభుత్వ పరంగా సాయం అందజేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. నిందితులకు శిక్ష పడేవిధంగా చూస్తానన్నారు. గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పిన్నింటి ఏకబాబు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి శ్రీనివాసులురెడ్డి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సంఘటనను శ్రీనివాసులు రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన శెట్టిబలిజ సంఘ నాయకుడు కేతా నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేతా సాయి, పెచ్చెటి శ్రీనివాసరావు, దొమ్మేటి సత్యనారాయణ, పట్నాల జువ్వాలు, ఆళ్ళ ఆనందరావు, పేర్ల దుర్గాప్రసాద్, కర్రి రామలక్ష్మి, కొప్పిశెట్టి రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రేమ చిగురిస్తే జీవితం సంతోషమే



బాబుతో మానుపాటి ప్రవీణ్ కుమార్, గౌతమి దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: ఒకరి మీద ఒకరికి నమ్మకం కలిగి ప్రేమ చిగురిస్తే.. కులం, అంగవైకల్యం ఏమి అడ్డురావని నిరూపించారు ధవళేశ్వరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మానుపాటి ప్రవీణ్ కుమార్, గుంటు గౌతమి దంపతులు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ చిన్న కథనం. ప్రవీణ్‌కుమార్ బీఎడ్ పూర్తి చేసి స్నేహితులతో కలిసి బీరువాలోని బాంగిల్స్ రాడ్స్ తయారు చేసే షాపునకు వెళ్లేవాడు. అక్కడికే గుంటు గౌతమి జీఎన్ఎం కోర్సు చేస్తూ పార్ట్‌టైం జాబ్‌కు వచ్చేది. 2013లో పరిచయం పెరిగి ఒకరిమీద ఒకరికి ప్రేమపెరిగింది. ఇరువైపుల పెద్దలకు చెప్పకుండానే 2015లో గౌరీపట్నంలో పెళ్లి చేసుకున్నారు. ప్రవీణ్ ఎస్సీ, గౌతమి బీసీ-ఏ సామాజిక వర్గాలకు చెందిన వారు. అనంతరం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఇరువైపులా పెద్దలను పోలీసులు పిలిపించి మాట్లాడారు. ముందుగా ప్రవీణ్ తల్లిదండ్రులు అంగీకరించడం, వారం రోజుల తరవాత గౌతమి తల్లిదండ్రులు అంగీకరించారు. అప్పటి నుంచి అన్యోన్యంగా కాపురం కొనసాగడంతో 2017లో బాబు, 2022లో పాప జన్మించారు. ప్రవీణ్ ప్రస్తుతం కాతేరు గ్రామపంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, గౌతమి రాజమహేంద్రవరం వార్డు సచివాలయంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. ప్రేమించి పెళ్లి చేసుకుని, సంతోషంగా ఉంటున్నామని ప్రవీణ్ కుమార్, గౌతమి తెలిపారు.

అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన



ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రిన్సిపాల్ రమణారావుకు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన లభించింది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి సుమారు 143 మంది విద్యార్థులు హాజరుకాగా, 118 మంది ఎంపికయ్యారు. హార్లిక్స్ ఫ్యాక్టరీ, టాగూర్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, డెయిరీ ఎక్విప్‌మెంట్స్, పరమేశ్వరి బయోటెక్స్, మారుతి మోటార్స్, ఏపీ ఈపీడీసీఎల్ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై అప్రెంటిస్ శిక్షణ కోసం అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. బి.సత్యనారాయణ, అప్రెంటిస్ అడ్వయిజర్ పెంకె శ్రీనివాసరావు, కోఆర్డినేటర్, జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ జీవీ రమణారావు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయపడటం మానేయాలి



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ రామసుబ్రహ్మణ్యం

కంబాలచెరువు: విద్యార్థి దశలో పరీక్షలు అత్యంత ప్రాముఖ్యమైనవని, వాటిని ఉత్సాహంగా ఎదుర్కోవాలే తప్ప భయపడి ఒత్తిడి తెచ్చుకోవద్దని డైట్ ప్రిన్సిపాల్ నూజిళ్ల రామసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక చున్నీలాల్‌జాజు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'పరీక్ష పర్వ్ 4.0' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్' సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఈ కార్యక్రమం రూపొందించారన్నారు. జిల్లా స్థాయిలో ఉన్న డైట్ కళాశాలలు వీలును బట్టి కనీసం పది పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. పరీక్ష పర్వ్ 4.0 ద్వారా ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని వివిధ పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని సబ్జెక్టులను ఎప్పటికప్పుడు చదువుకుంటూ ఒక ప్రణాళిక ప్రకారం పరీక్షలకు హాజరైతే ఎటువంటి ఒత్తిడి ఉండదన్నారు. మారుతున్న పరీక్షా విధానాలను ముందుగానే అవగాహన చేసుకోవడం, మాదిరి ప్రశ్నపత్రాలను పూరించడం ద్వారా సబ్జెక్టుపై సందేహాలు తొలగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు కేవీ మునీశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు, వస్త్రాల వితరణ



వృద్ధులకు రగ్గులు, వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చందన రమేష్

రాజమహేంద్రవరం రూరల్: ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో బొమ్మూరు మురళీకొండపై గల రూత్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం రగ్గులు, నూతన వస్త్రాలు వితరణ చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు చందన రమేష్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తోచిన విధంగా సామాజిక సేవ చేయాలన్నారు. వృద్ధాశ్రమంలోని రేకుషెడ్ సీలింగ్‌కు అయ్యే ఖర్చును చందన ట్రస్ట్ ద్వారా ఇస్తానన్నారు. కార్యక్రమంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా యోనా, వైఎస్సార్ సీపీ వైనాయకులు మత్సేటి శివ, దాకే శ్రీనివాసరావు, హోమ్ నిర్వాహకుడు బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సరోజినీ నాయుడికి పుష్పాంజలి

కడియం: సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి ఎంఈవో వి.లజపతిరాయ్ సోమవారం పుష్పాంజలి ఘటించారు. వేమగిరితోట ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటయోధురాలిగా, గాయకురాలిగా, మహిళా నాయకురాలిగా సరోజిని సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.జయరాజు, ఉపాధ్యాయులు నాగమణి, అవని కుమారి, ఇంజినీరింగ్ అధికారి కె.వీరభద్రరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ

కడియం: మండలంలోని వేమగిరి, కడియపులంక గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట ఆయా గ్రామాలకు చెందిన నాయకులు ఉన్నారు.

ఈపీఎఫ్ పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) పెన్షన్ దారులందరికీ ఒకటో తేదీన పింఛన్ ఇవ్వాలని, కనీస పింఛన్ నెలకు రూ.9 వేలు చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం రీజినల్ పీఎఫ్ కార్యాలయం వద్ద సీహెచ్ మోహనరావు అధ్యక్షతన సోమవారం ధర్నా నిర్వహించారు. ఏపీ ఆర్‌పీఏ కోశాధికారి సీహెచ్ సత్యనారాయణ రాజు, జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు, కార్యదర్శి కె.సత్తి రాజు, సీపీఎం నాయకుడు పోలిన వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఆర్టీసీ నాయకులు మంగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 19న కాకినాడలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కాకినాడ జిల్లా సబ్ ట్రెజరీ పరిధిలో 2400 మందికి పెన్షన్లు జమ చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

నర్సరీలను సందర్శించిన ప్రొఫెసర్ల బృందం



సత్యదేవ నర్సరీలో తమిళనాడు ప్రొఫెసర్లు

కడియం: తమిళనాడుకు చెందిన హార్టీకల్చర్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్లు, విద్యార్థుల బృందం సోమవారం కడియపులంకలోని సత్యదేవ నర్సరీని సందర్శించింది. 52 మంది విద్యార్థులతో కూడిన ఈ బృందం నర్సరీల నిర్వహణ తదితర విషయాలను తెలుసుకుంది. ప్రొఫెసర్లు ఏ.ఎలెవెన్ మేరీ, కె.మురుగంధం, ఎం.ఇజాస్ మాట్లాడుతూ వేల రకాల మొక్కలు ఒకే చోట లభ్యమయ్యేది కడియం ప్రాంత నర్సరీల్లోనేనన్నారు. ఈ నేపథ్యంలో తమ ఇనిస్టిట్యూట్ విజ్ఞాన పర్యటనల్లో ఈ ప్రాంతానికి ప్రాధాన్యమిస్తామన్నారు. ఈ బృందానికి నర్సరీ అధినేతలు పుల్లా చంటియ్య, పెద సత్యనారాయణ ఘనంగా స్వాగతం పలికారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

సీటీఆర్ఐ: జిల్లాలో ఈనెల 15, 16, 17 తేదీల్లో జరిగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని సమన్వయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మెయిన్ రోడ్డులోని హోటల్ జగదీశ్వరిలో సోమవారం సమావేశం నిర్వహించారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పాల్గొన్నారు.

అతివేగంతో వెళితే చర్యలు తప్పవు



మట్టి సప్లయిదారులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ తిలక్

కడియం: నర్సరీలకు మట్టి రవాణా చేసే వాహనాలను అతివేగంగా నడిపినా, అనుభవం లేని డ్రైవర్లను వినియోగించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ హెచ్చరించారు. సోమవారం కడియపులంకలోని నర్సరీ అసోసియేషన్ కార్యాలయంలో ఈ మేరకు మట్టి రవాణాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా చంటియ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ తిలక్ మాట్లాడుతూ నిబంధనలను అనుసరించి మట్టి రవాణా చేయాలన్నారు. వాహనాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి నాగశివాజీ, కార్యదర్శి బొర్సు సుబ్బారాయుడు, ట్రెజరర్ చక్కపల్లి పోలరాజు, డైరెక్టర్లు సింగంశెట్టి శ్రీను, ఆకుల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

16 నుంచి కల్యాణోత్సవాలు

కడియం: దుళ్లలోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ అర్చకుడు బాదంపూడి సత్యనారాయణ శివాచార్యులు, ఈవో శ్రీనివాసరావు తెలిపారు. 16వ తేదీ ఉదయం పల్లకీసేవ, రాత్రి స్వామివారి కల్యాణం, 18న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, భక్తుల సహకారంతో అన్నదానం, మధ్యాహ్నం రథయాత్ర జరుగుతాయన్నారు. 20వ తేదీ ఉదయం త్రిశూల స్నానం, రాత్రి శ్రీపుష్పయాగం ఉంటాయన్నారు.